సాక్షి మహబూబాబాద్

బుధవారం । 23 । ఏప్రిల్ । 2025



సివిల్స్‌లో మెరిశారు..

- ఉమ్మడి వరంగల్ జిల్లానుంచి నలుగురు ఎంపిక
- తెలుగు రాష్ట్రాల మొదటి ర్యాంకర్ వరంగల్‌వాసే
- సాయి శివానికి 11వ, జయసింహారెడ్డికి 46వ ర్యాంకు
- నీరుకుళ్ల యువకుడు హరిప్రసాద్‌కు 255వ ర్యాంకు
- ఐఏఎస్ కావాలని లక్ష్యంతోనే ముందుకు..
- ఐపీఎస్ గోల్ కొట్టానంటున్న 855వ ర్యాంకర్ జితేందర్ నాయక్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మంగళవారం విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లానుంచి నలుగురు అభ్యర్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. తెలుగు రాష్ట్రాల మొదటిర్యాంకర్ వరంగల్ నగరవాసే. వరంగల్ శివనగర్‌కు చెందిన ఇట్టబోయిన రాజ్ కుమార్, రజిత దంపతుల కుమార్తె సాయి శివాని ఆలిండియా స్థాయిలో 11వ ర్యాంకు, రావుల జయసింహారెడ్డి 46వ ర్యాంకులు సాధించి జిల్లా పేరుప్రతిష్టలను దేశస్థాయిలో నిలిపారు.

- సాక్షి నెట్‌వర్క్

- వివరాలు 10లో▸

బాలికలదే పైచేయి

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన అమ్మాయిలు

- ప్రథమ సంవత్సరంలో 48.43శాతం ఉత్తీర్ణత
- ద్వితీయ సంవత్సరంలో 64.68 శాతం పాస్
- రాష్ట్రస్థాయిలో జిల్లాకు 28వ ర్యాంకు.. గతేడాది 17వ స్థానం

మహబూబాబాద్ అర్బన్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో బాలికలు సత్తాచాటారు. అబ్బాయిలతో పోల్చితే అమ్మాయిలు అత్యధికంగా ఉత్తీర్ణత పొంది పైచేయి సాధించారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 48.43శాతం ఉత్తీర్ణత సాధించగా.. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 64.68 శాతం పాసయ్యారు. కాగా రాష్ట్రస్థాయి ఫలితాల్లో గతేడాది జిల్లా 17వ స్థానంలో నిలువగా.. ప్రస్తుతం 28వ స్థానం నిలిచింది.

బాలికలదే హవా..

ఇంటర్ మొదటి సంవత్సరం జనరల్ గ్రూపులో బాలురు 1471 మంది పరీక్షలు రాయగా 561 మంది మాత్రమే పాసయ్యారు. 1725 మంది బాలికలకు 1013 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ గ్రూపులో 564మంది బాలురకు132 మంది పాసయ్యారు. అలాగే 634మంది బాలికలకు 422మంది ఉత్తీర్ణత పొందారు. మొత్తంగా ఫస్టియర్‌లో 4,394 మంది విద్యార్థులకు 2128 మంది పాసై.. 48.43శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో జనరల్ గ్రూపులో బాలురు 1374మంది పరీక్షలు రాయగా 703 మంది పాసయ్యారు. 1798 మంది బాలికలకు 1328 మంది ఉత్తీర్ణులయ్యారు.ఒకేషనల్ గ్రూపులో 421 మంది బాలురకు 128 మంది పాసయ్యారు.617మంది బాలికలకు 522 మంది ఉత్తీర్ణులయ్యారు.మొత్తంగా ద్వితీయ సంవత్సరంలో4,210మంది విద్యార్థులకు 2,681మంది పాసై 63.68శాతం ఉత్తీర్ణత సాధించారు.

నిరుత్సాహపర్చిన ఫలితాలు..

జిల్లాలో ఇంటర్ ఫలితాలు నిరుత్సాహపరిచాయి. రాష్ట్రస్థాయిలో మానుకోట జిల్లా 28వ స్థానంలో నిలిచింది. ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత అంతంత మాత్రంగానే ఉంది. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారు తప్ప.. అందుకు తగిన ఫలితాలు రావడం లేదు. గురుకుల కళాశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు ప్రతీరోజు రైళ్లలో అప్‌డౌన్ చేస్తూ.. ఇతర వ్యాపారులపై దృష్టిపెట్టి విద్యార్థులను గాలికి వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉండగా కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అందించకపోవడంతో విద్యార్థులు క్లాసులకు దుమ్మా కొట్టడం కూడా ఫలితాలపై ప్రభావం చూపిందని విద్యార్థి సంఘాల నాయకులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి వచ్చే ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గీతకార్మికుడి కుమారుడికి అధిక మార్కులు

- సెకండియర్ ఫలితాల్లో మోడల్ స్కూల్ విద్యార్థి తరుణ్‌కు 991 మార్కులు

కేసముద్రం: ఇంటర్ సెకండియర్ ఎంపీసీ ఫలితాల్లో ఓ గీతకార్మికుడి కుమారుడు ఉత్తమ మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచాడు. ఇనుగుర్తి మండలం చిన్న ముప్పారం గ్రామానికి చెందిన కారుపోతు రాజు–రజిత దంపతులకు కుమారుడు తరుణ్, కూతురు ఉషశ్రీ ఉన్నారు. గీత కార్మికుడైన రాజు కల్లు గీయడంతో పాటు తనకున్న రెండెకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ తన పిల్లలను చదివిస్తున్నాడు. కాగా మంగళవారం వెలువడిన ఇంటర్ సెంకడియర్ ఎంపీసీ ఫలితాల్లో 991 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచాడు. తరుణ్ మానుకోటలోని సాంఘిక సంక్షేమ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 5వ తరగతిలో సీటు సాధించి 10వ తరగతి వరకు అక్కడే చదివాడు. టెన్త్‌లో 9.8 పాయింట్లు సాధించాడు. ఆ తర్వాత ఖమ్మంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో తరుణ్ ఇంటర్ ఫస్టియర్(ఎంపీసీ) చదివాడు. అయితే ఆరోగ్య సమస్యతో తిరిగి కేసముద్రం మండలం కల్వల మోడల్‌స్కూల్‌లో చేరి ఇంటర్ సెకండియర్‌లో ఉత్తమ


తల్లిదండ్రులతో తరుణ్

ఫలితాలు సాధించాడు. తాము పడిన కష్టానికి కొడుకు మంచి ఫలితాన్ని సాధించాడంటూ తల్లిదండ్రులు ఆనందంలో మునిగిపోయారు. కాగా సివిల్స్‌కు ప్రిపేర్ అయి ఐఏఎస్ సాధించడమే తన లక్ష్యమని తరుణ్ తెలిపాడు. మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ పరిమి నవీన్, అధ్యాపక బృందం తరుణ్‌ను అభినందించారు.

విదేశాల్లో మంచి ఉద్యోగం సాధిస్తా



మా తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు చేసుకుని ఇష్టంతో చదివి ఎంపీసీలో 990 మార్కులు సాధించాను. నాకు కాలేజీలో అధ్యాపకులు అన్ని విధాలా సహకరించారు. విదేశాలల్లో మంచి ఉద్యోగం సాధించి భవిష్యత్‌లో తల్లిదండ్రులను మంచిగా చూసుకుంటాను.

- ఎన్.వర్షిణి, గౌతమి కళాశాల, మానుకోట

డాక్టర్ కావడమే నా లక్ష్యం



మా నాన్న కూలీ పనులకు వెళ్తేనే కుటుంబం గడుస్తుంది. కష్టపడి సాంఘిక సంక్షేమ కళాశాలలో ఇంటర్‌లో సీటు సాధించాను. బైపీసీలో 981 మార్కులు సాధించాను. భవిష్యత్‌లో డాక్టర్‌గా స్థిరపడి కుటుంబాన్ని చూసుకుంటూ పేదలకు ఉచిత వైద్య సేవలు అందజేస్తాను.

- కల్యాణి, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, మానుకోట

చార్టర్డ్ అకౌంటెంట్ కావాలని కోరిక



జిల్లా కేంద్రంలోని మార్వాడీ బజార్‌లో మానాన్న సెలూన్ షాప్‌లో పనిచేస్తారు. అమ్మ 8 సంవత్సరాల క్రితం చనిపోయింది. నాన్న కష్టాన్ని దగ్గరగా చూస్తూ కసితో చదివి సీఈసీలో 934 మార్కులు సాధించాను. సీఏ చదివి చార్టర్డ్ అకౌంటెంట్ అవుతాను.


-సాయి దుర్గేశ్, మోడల్ కళాశాల

వచ్చే ఏడాది ముందంజలో ఉంటాం



ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాం. కలెక్టర్, ఎస్పీ, అధ్యాపకుల సహకారంతో ఎక్కడ ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూశాం. విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న ఫలితాలు సాధించారు. వచ్చే సంవత్సరం మెరుగైన ఫలితాల కోసం కృషి చేస్తాం.

- సీహెచ్. మదార్‌గౌడ్, డీఐఈఓ



'భూ భారతి'తో విప్లవాత్మక మార్పులు

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

గూడూరు: భూ సమస్యల పరిష్కారం కోసం తీసుకొచ్చిన భూ భారతి చట్టంతో విప్లవాత్మక మార్పులు వస్తాయని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండలంలోని భూపతిపేట రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. గతంలో ఉన్న ధరణి పోర్టల్‌లో ప్రభుత్వం ఎవరికీ ఎలాంటి అధికారాలు ఇవ్వలేదని, దీంతో సమస్యలు ఉత్పన్నమైనట్లు చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం ప్రకారం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతు ఆధార్ లింకు ద్వారా భూధార్ నంబర్ కేటాయిస్తామన్నారు. ఈ సందర్భంగా సీతానగరం గ్రామంలో నెలకొన్న రైతుల భూ సమస్యల


భూపతిపేట రైతు వేదికలో మాట్లాడుతున్న కలెక్టర్

పరిష్కారం కోసం కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇవ్వగా, అవసరమైతే తాను సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అదనపు కలెక్టర్ వీరబ్రహ్మంచారి, ఆర్డీఓ కృష్ణవేణి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు, డీపీఓ విజయనిర్మల, నెక్కొండ ఏఎంసీ వైస్ చైర్మన్ నరేష్‌రెడ్డి, ఏడీఏ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ధరణి పోర్టల్ సీతానగరం రైతులకు శాపం



గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ సీతానగరంతో పాటు సమీప గ్రామాల రైతులకు శాపంగా మారింది. ఇప్పటి మా సాగు భూములను 1954–1970 మధ్యలో మా తాత, ముత్తాతలు ఇక్కడి ఒక ముస్లిం వ్యక్తి నుంచి కొనుగోలు చేశారు. తెలంగాణ రాక ముందు వరకు మా భూములు రెవెన్యూలో మా పేర్లపై ఉన్నాయి. తెలంగాణ వచ్చాక ఏర్పడిన ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌లో మా పేర్లు మాయమయ్యాయి. ఈ సమస్యపై ఎన్నో ఏళ్లుగా ఐటీడీఏ అధికారులు, జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నాం. మా పేర్లపై ఉన్న కాగితాలు ఉన్నాయి. మా సమస్యకు వెంటనే పరిష్కార మార్గం చూపాలి.

- ఆకుల రమేశ్, రైతు, సీతానగరం

ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలి

- వీసీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మహబూబాబాద్: ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్‌ను ఈ నెల 30లోపు పూర్తి చేయాలని రాష్ట్ర రెవె న్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతికుమారి, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్, హౌసింగ్‌శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ గౌతమ్‌లతో కలిసి ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి చట్టంపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలన్నారు. అధికారులు భూభారతి


వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, వీరబ్రహ్మచారి

చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. వీసీలో జిల్లా నుంచి కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, వీరబ్రహ్మచారి పాల్గొన్నారు.







సివిల్స్‌లో మెరిశారు..

యూపీఎస్సీ ఫలితాల్లో మనోళ్ల సత్తా..

నలుగురు ఉమ్మడి వరంగల్ జిల్లా అభ్యర్థులకు అత్యుత్తమ ర్యాంకులు

దేశ అత్యున్నత సర్వీస్ సివిల్స్‌లో మనోళ్లు మెరిశారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) మంగళవారం విడుదల చేసిన తుది ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా అభ్యర్థులు అత్యుత్తమ ర్యాంకులు కైవసం చేసుకున్నారు. వరంగల్ శివనగర్‌కు చెందిన ఇట్టబోయిన సాయి శివాని 11వ ర్యాంకు, హనుమకొండకు చెందిన రావుల జయసింహారెడ్డి 46, నీరుకుళ్లకు చెందిన పోతరాజు హరిప్రసాద్ 255, భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన గుగులోత్ జితేందర్ నాయక్ 855 ర్యాంకు సాధించారు. దీంతో కుటుంబీకులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

UPSC

నీరుకుళ్ల యువకుడు.. సివిల్స్ సాధించాడు

- తండ్రి ప్రోత్సాహంతో 255వ ర్యాంకు

ఆత్మకూరు: హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్లకు చెందిన పోతరాజు హరిప్రసాద్ సివిల్స్ సాధించారు. తండ్రి ప్రోత్సాహంతో యూపీఎస్సీ ఫలితాల్లో జాతీయస్థాయిలో 255 ర్యాంకు సాధించారు. కాగా, హరిప్రసాద్‌కు ఐఏఎస్ పోస్టు దక్కనుంది. హరిప్రసాద్ తండ్రి కిషన్ నల్లబెల్లి మండలం నందిగామ జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తల్లి విజయ గృహిణి. వీరు హనుమకొండలోఉంటున్నారు. హరిప్రసాద్ పాఠశాల విద్య హనుమకొండలోని ఆర్యభట్ట పాఠశాలలో కొనసాగింది. ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో చదివారు. ఐఐటీ ముంబైలో బీటెక్(ఎలక్ట్రికల్)2016లో పూర్తి చేశారు. అనంతరం జపాన్‌లోని ఓ కంపెనీలో 2017 నుంచి 2019 వరకు పనిచేశారు. అనంతరం ఇంటికి వచ్చి సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. ఇంటివద్దే చదువుకున్నారు. రెండుసార్లు ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. తాజా ఫలితాల్లో 255వ ర్యాంకు సాధించి తన కల సాకారం చేసుకున్నారు.



హరిప్రసాద్



అమ్మానాన్నతో హరిప్రసాద్

నాన్న ప్రోత్సాహంతో..

మా నాన్న ప్రోత్సాహంతోనే సివిల్స్ వైపు దృష్టి సారించా. ఎలాంటి కోచింగ్ లేకుండా ఇంటి వద్దే ప్రణాళికతో ప్రిపేరయ్యా. 255 ర్యాంకు రావడం ఆనందంగా ఉంది. నాకు ఐఏఎస్ వచ్చే అవకాశం ఉంది. **- పోతరాజు హరిప్రసాద్, సివిల్స్ 255 ర్యాంకర్**

కొడుకు కలెక్టర్ కావాలనుకున్నా..

నా కొడుకును కలెక్టర్ చేయాలనే కల నెరవేరింది. సివిల్స్‌తోనే సమాజ సేవ సాధ్యం. అందులోనే తృప్తి ఉంటుంది. మా గ్రామీణ ప్రాంతం నుంచి నా కొడుకు సివిల్స్ సాధించడం గర్వంగా ఉంది. **- పోతరాజు కిషన్, హరిప్రసాద్ తండ్రి**

నెలరోజుల్లో డబుల్ ధమాకా

- మొన్న గ్రూప్ వన్, ఇప్పుడు సివిల్స్
- సత్తాచాటిన వరంగల్ వాసి
- తెలుగు రాష్ట్రాల్లో టాపర్‌గా నిలిచిన శివాని

సాక్షి, వరంగల్: రెండు తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి సివిల్స్ ర్యాంక్‌ల్లో ఇట్టబోయిన సాయి శివాని టాపర్‌గా నిలవడంతో వరంగల్ పేరు ఒక్కసారిగా మార్మోగింది. నెల వ్యవధిలోనే ఆమె డబుల్ ధమాకా సాధించారు. రెండు ప్రభుత్వ ఉద్యోగాలు, అవి కూడా గ్రూప్–1లో రాష్ట్ర స్థాయిలో 21వ ర్యాంకు, ఇప్పుడూ సివిల్స్‌లో ఏకంగా జాతీయ స్థాయిలో 11వ ర్యాంక్ సాధించి ఔరా అనిపించారు. వరంగల్ శివనగర్ వాసవీ కాలనీలోని తమ ఇంట్లోనే చదువుకుంటూ, ఆన్‌లైన్ పాఠాలు వింటూ జాతీయస్థాయి ఘనత సాధించడం విశేషం. బీటెక్ పూర్తయిన మూడేళ్లలోనే రెండో ప్రయత్నంలో సివిల్స్ సాధించి వరంగల్‌కు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారు. తండ్రి రాజు మెడికల్ రిప్రజంటేటివ్ పనిచేస్తుండగా, అమ్మ రజిత గృహిణిగా ఉంటూ తమ కుమార్తె సాయి శివాని కల సాకారం కోసం వెన్నుతట్టి ప్రోత్సహించారు. వారి ప్రోద్బలం, సాయి శివాని పట్టుదలతో చదవడంతోనే ఈ ఘనత సాధ్యమైంది.



సాయి శివాని



కుటుంబ సభ్యులతో సాయి శివాని

ఐదో ప్రయత్నంలో ఐఏఎస్..

- ఇప్పటికే ఐపీఎస్ శిక్షణలో జయసింహారెడ్డి
- తాజాగా ఆల్ ఇండియా స్థాయిలో 46వ ర్యాంకు

హన్మకొండ: హనుమకొండకు చెందిన రావుల జయసింహారెడ్డి ఐదో ప్రయత్నంలో ఐఏఎస్ ర్యాంకు సాధించాడు. గతంలో ఐపీఎస్‌కు ఎంపికైన జయసింహారెడ్డి ఈసారి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఆల్ ఇండియా స్థాయిలో 46వ ర్యాంకు సాధించారు. జయసింహారెడ్డి తండ్రి రావుల ఉమారెడ్డి వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో సహ పరిశోధన సంచాలకుడిగా విధులు నిర్వహిస్తుండగా తల్లి లక్ష్మి గృహిణి. జయసింహారెడ్డి గతంలో సివిల్స్ రాయగా ఒకసారి 217, మరోసారి 104 ర్యాంకు సాధించగా ఐపీఎస్ వచ్చింది. ప్రస్తుతం నేషనల్ అకాడమీ హైదరాబాద్‌లో ఐపీఎస్ శిక్షణ పొందుతున్నారు. జయసింహారెడ్డి పాఠశాల విద్య 7వ తరగతి వరకు జగిత్యాలలో, 8 నుంచి 10 వరకు హనుమకొండ ఎస్ఆర్ ఎద్యుస్కూల్‌లో చదివారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేశారు. హైదరాబాద్ ఐఐటీలో బీటెక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అభ్యసించారు. తర్వాత 2020 నుంచి సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. మొదటి రెండు ప్రయత్నాల్లో ప్రిలిమ్స్ వరకు వెళ్లారు. మూడో ప్రయత్నంలో ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలో ప్రతిభ కనబరిచి 217వ ర్యాంకు సాధించారు. నాలుగో ప్రయత్నంలో మరింత మెరుగైన ప్రతిభ కనబరిచి 104వ ర్యాంకు సాధించారు. ఓ వైపు ఐపీఎస్ శిక్షణ పొందుతూనే ఐదో ప్రయత్నంలో 46వ ర్యాంకు సాధించి తన లక్ష్యం చేరుకున్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు రావుల లక్ష్మి, ఉమారెడ్డి మాట్లాడుతూ తమ కుమారుడు ఐఏఎస్ సాధించడం సంతోషంగా ఉందన్నారు. తనకు ఇద్దరు కుమారులని, అందులో జయసింహారెడ్డి చిన్నవాడని, పెద్ద కుమారుడు మనీష్ చంద్రారెడ్డి కాలిఫోర్నియాలో ఆపిల్ సంస్థలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



రావుల జయసింహారెడ్డి

సొంతంగా ప్రిపేర్..

- సివిల్స్‌లో 855 ర్యాంకు సాధించిన జితేందర్ నాయక్

భూపాలపల్లి అర్బన్: సివిల్స్‌లో భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన గుగులోత్ జితేందర్ నాయక్ మెరిశారు. ఐపీఎస్ కావాలనే లక్ష్యంతో ఎలాంటి శిక్షణ లేకుండా ఇంట్లోనే చదువుకుంటూ యూపీఎస్సీ ఫలితాల్లో 855 ర్యాంకు సాధించారు. జితేందర్ తండ్రి హేమానాయక్ భూపాలపల్లి ఏరియా సింగరేణి వర్క్‌షాపులో ఉద్యోగం చేస్తున్నారు. జితేందర్ 2021లో బీటెక్ పూర్తి చేసి 2022లో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఏడాది పాటు ఉద్యోగం చేశారు. అనంతరం 2023 నుంచి ఇంట్లోనే ఉండి సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. ఎలాంటి శిక్షణ లేకుండా సొంతంగా చదువుకున్నట్లు తెలిపారు. చిన్నప్పటి నుంచి సివిల్ సాధించాలనే లక్ష్యంతో చదువుకున్నట్లు జితేందర్ పేర్కొన్నారు.



గుగులోత్ జితేందర్

‘ఎస్ఆర్’ విద్యార్థుల విజయభేరి



బండి ప్రతిష్ఠ వైశాలిని ఆకోజ హాసిని పశాంతిక రమ్య రాగిశివప్రియ శ్రీనితా



రష్మిత అనూహ్య రామచరణ్ తేజస్విని వైశాలి కార్తీక స్పందన

విద్యారణ్యపురి: ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షల ఫలితాల్లో తమ విద్యార్థులు విజయభేరి మోగించారని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి మంగళవారం తెలిపారు.

ఇంటర్ ఫస్టియర్‌లో..

ఎంపీసీ విభాగంలో బండి ప్రతిష్ఠ 470 మార్కులకు 468 మార్కులు, వైశాలి 468, ఆకోజు హాసిని 468, బాసుపెల్లి పశాంతిక రమ్య 468 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో రాగి శివ ప్రియ 440మార్కులకు 438 మార్కులు, ఎ. శ్రినితా 438 మార్కులు సాధించారు. ఎంఈసీ విభాగంలో ఎం. ఉమామహేశ్వర్ 500 మార్కులకుగాను 495, ఆయుష్మతి నయినా 495 మార్కులు సాధించారని వారు తెలిపారు.

ఇంటర్ సెకండియర్‌లో..

ఇంటర్ సెకండియర్‌లో ఎంపీసీ విభాగంలో ఇందూరి రష్మిత 1000 మార్కులకు 996 మార్కులు, కందుకూరి అనూహ్య 995, ఆర్. రామచరణ్ 995, వి. వెంకటలక్ష్మి తేజస్విని 995 మార్కులు సాధించారని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తెలిపారు. ఎంపీసీ విభాగంలో 990 మార్కులకుపైగా 14మంది విద్యార్థులు సాధించారని వారు తెలిపారు. బైపీసీ విభాగంలో ఎ. వైశాలి 1000 మార్కులకు 994మార్కులు, టి. కార్తీక 994 మార్కులు సాధించారు. ఎంఈసీ విభాగంలో డి. సుమతికి 1000 మార్కులకు 988మార్కులు, సీఈసీ విభాగంలో టి. స్పందన 1000 మార్కులకు 986మార్కులు సాధించారు. భవిష్యత్‌లో మరింత అత్యుత్తమైన మార్కులు సాధించేలా తీర్చిదిద్దుతామని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

‘సువిద్య’ విద్యార్థుల విజయకేతనం



ఎస్.ధృతి రెడ్డి ఎస్.జీవిక పి.శ్రీజ పి.షణ్ముక ప్రియ ఎం.సిరిచందన బి.దేవిశ్రీ డి.ప్రీతిక

హన్మకొండ: ఇంటర్మీడియట్ ఫలితాల్లో హనుమకొండ నక్కలగుట్టలోని సువిద్య జూనియర్ కాలేజీ ఫర్ గర్ల్స్ విజయకేతనం ఎగురవేసింది. మంగళవారం వెలువడిన ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణులయ్యారని కళాశాల కరస్పాండెంట్ కె.శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు ఎ.జితేందర్ రెడ్డి, ఎస్.వెంకట్ రెడ్డి తెలిపారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో ఎస్.ధృతి రెడ్డి 467 మార్కులు, ఎస్.జీవిక 463, పి.శ్రీజ 459, బీపీసీ మొదటి సంవత్సరంలో పి.షణ్ముక ప్రియ 424, ద్వితీయ సంవత్సరంలో ఎం.సిరిచందన 986, బి.దేవిశ్రీ 985, డి.ప్రీతిక 985 మార్కులు సాధించారన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ అభినందించారు.

ఇంటర్మీడియట్‌లో ‘రెజోనెన్స్’ సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న రెజోనెన్స్ విద్యాసంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి, డైరెక్టర్లు, అధ్యాపకులు

హన్మకొండ: ఇంటర్మీడియట్ ఫలితాల్లో రెజోనెన్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో వరంగల్, హనుమకొండలోని రెజోనెన్స్ జూనియర్ కళాశాలలు 90 రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బీపీసీలో రాష్ట్ర ఫస్ట్ ర్యాంకుతోపాటు మొత్తం 80 రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్లు వివరించారు. నలుగురు విద్యార్థులు 470 మార్కులగాను 468 మార్కులతో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకుసాధించారని, 22 మంది విద్యార్థులు 470 మార్కులకు 467 మార్కులతో రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకు సాధించారన్నారు. 21 మంది తృతీయ ర్యాంకు, 25 మంది రాష్ట్ర స్థాయి 4వ ర్యాంకు సాధించారని తెలిపారు. ద్వితీయ సంవత్సరంలోనూ విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో జయకేతనం ఎగుర వేశారన్నారు. 21 మంది విద్యార్థులు రాష్ట్ర టాప్ మార్కులు, 995, 994, 993, 992, 991, 990తో పాటు మరిన్ని ఉత్తమ ర్యాంకులు సాధించారని వివరించారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో భూక్యా మనోజ్ కుమార్ 468, వేముల అనిక్షిత 468, గందె వర్ష 468, మంతిని సహస్ర 468 మార్కులు, ద్వితీయ సంవత్సరంలో నీలం నిక్షిత 995, బుర్ర అక్షిత 994, బీపీసీ మొదటి సంవత్సరంలో గండ్ర శ్రీజ 438, దావర్తి శ్రీనిధి 436, దర్మల శ్రీతిక 436, ద్వితీయ సంవత్సరంలో ఎం.పూజశ్రీ 992, ఆర్.ఇక్షావర్ 992, డి.త్రిలోచన్ 992, ఎం.అస్మిత 992 మార్కులు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్, డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు. డైరెక్టర్లు లెక్కల మహేందర్ రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, సీఏఓ లెక్కల రమ్య, అకడమిక్ డీన్ గోపాలరావు, డీన్ కె.సాంబశివుడు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ‘శివాని’ విజయదుందుభి



శైజా మాధవి హర్షిణి రిషిత నవదీప్ చక్రి


హసన్‌పర్తి: ఇంటర్మీడియట్ ఫలితాల్లో భీమారంలోని శివాని కళాశాల విజయదుందుభి మోగించింది. జూనియర్ ఎంపీసీ విభాగంలో కళాశాలకు చెందిన నేరేళ్ల రిషిత 468 మార్కులు, నాగుల నవదీప్ 468 మార్కులు, చక్రిక 468, ఎస్.జశ్వంత్ 467, వరుణ్ తేజా 467, శివకుమార్ 467, తేజాశ్రీ 467, పూజిత 467, సంధ్యా 467 మార్కులు సాధించినట్లు శివాని విద్యాసంస్థల కరస్పాండెంట్ స్వామి తెలిపారు. బీపీసీ విభాగంలో బానోత్ స్వాతి 435 మార్కులు, ఇంద్రజా 434 మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో మేకల కార్తీక్ 484 మార్కులు సాధించాడు. సీనియర్ ఎంపీసీ విభాగంలో చీరాల శైజా 995 మార్కులు, కె. మాధవి 995, బి. మనీషా 993, నక్షత్ర 993, దివ్యశ్రీ 992, రోజా 992, పోరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి 991, జెమిని 990 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ తెలిపారు. బీపీసీ విభాగంలో హర్షిణి 993 మార్కులు, హన్సిక 992, సుష్మిత 992 మార్కులు సాధించారని కరస్పాండెంట్ స్వామి చెప్పారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ స్వామి, ప్రిన్సిపాళ్లు చంద్రమోహన్, సురేందర్‌రెడ్డి, డైరెక్టర్లు రాజు, రమేశ్, మురళీధర్, సురేశ్, సంతోశ్‌రెడ్డి అభినందించారు.




విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

జూనియర్ ఇంటర్‌లో ‘ఇన్‌స్పైర్’కు ప్రథమ ర్యాంకు

హసన్‌పర్తి: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎర్రగట్టుగుట్ట సమీపంలోని ఇన్‌స్పైర్ అకాడమీ విద్యాసంస్థకు చెందిన తీగల సాయి శ్రేష్ఠత జూనియర్ ఇంటర్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించినట్లు డైరెక్టర్ భరత్‌కుమార్ తెలిపారు. ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు 468 మార్కులు సాధించిన రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అలాగే, ఎంపీసీ విభాగంలో మేర్గు అజయ్ 464, వంశీ 464, శ్రీ చరణ్ 463, సాయిప్రియ 462, సిరి చందన 460, సాయి ప్రియ 462, బైపీసీ విభాగంలో మధుప్రియ 432 మార్కులు, కీర్తిరోషి 431, సీఈసీ విభాగంలో నూతన శ్రీ 459మార్కులు, కిరణ్మయి 455 మార్కులు సాధించినట్లు చెప్పారు.ఈ సందర్భంగా సాయి శ్రేష్ఠతను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల పాలక వర్గ సభ్యులు రాజ్‌కుమార్,మమత, సుంకరి శ్రీరాం రెడ్డి, హరీశ్‌గౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.



సాయి శ్రేష్ఠత



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

వక్ఫ్ బోర్డును అడ్డుపెట్టుకొని దోచుకున్నారు..

మహబూబాబాద్ అర్బన్: దేశంలో వక్ఫ్ బోర్డును అడ్డుపెట్టుకొని కొంత మంది నాయకులు దోచుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ చైర్మన్ మార్తినేని ధర్మారావు అన్నారు. జిల్లా కేంద్రంలోనీ బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వక్ఫ్ బోర్డు సరవణ చట్టం ప్రయోజనాల గురించి వివరించడానికి బీజేపీ దేశావ్యాప్తంగా వక్ఫ్ సుధార్ జన జాగరన్ అభ్యాస్ ప్రచారాన్ని ప్రారంభించిందన్నారు. మే 5వరకు ప్రచారం కొనసాగుతుందన్నారు. వక్ఫ్ సవరణ చట్టంతో ప్రతి పేద ముస్లింకు న్యాయం జరుగుతుందన్నారు. ముస్లింల ఇంటింటికీ వెళ్లి చట్టంపై అవగాహన కల్పిస్తామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం పార్టీలకు ముస్లిం ఓట్లు మాత్రమే అవసరమా.. మిగిలిన వారి ఓట్లు అవసరం లేదా అని ప్రశ్నించారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో వక్ఫ్‌బోర్డు ఆదాయం ఎక్కడికి పోతుందనే విషయాన్ని అసదుద్దీన్, అక్బరుద్దీన్, కాంగ్రెస్ పాలకులు చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్యామ్‌సుందర్ శర్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రరావు, జిల్లా నాయకలు రాంబాబు, వెంకన్న, ఇందుభారతి, సందీప్, సత్యనారాయణ, ముస్తఫా, వక్ఫ్ సంస్కరణల కోకన్వీరన్ తుంపిళ్ల శ్రీనివాస్, మురళి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మారావు

కాళోజీ కళాశాల ప్రభంజనం


హసన్‌పర్తి: ఇంటర్మీడియట్ ఫలితాల్లో చింతగట్టులోని కాళోజీ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్లు కళాశాల చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. సీనియర్ ఇంటర్ బీపీసీ విభాగంలో సురేశ్ 993 మార్కులు, ఎస్. వైష్ణవి 991 మార్కులు, ఎంపీసీ విభాగంలో సీహెచ్. శ్రీకృతి 991 మార్కులు, జి. తేజస్వీని 991, హాసిని 989, స్ఫూర్తి 985,అనురాఘవగౌడ్ 985 మార్కులు, సాధించినట్లు చెప్పారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో ఎస్. వంశీ 463 మార్కులు, సింధు 461, కె. అక్షిత 460 , శ్రీనిధి 460 మార్కులు, బీపీసీ విభాగంలో ఆశ్రయ 428 మార్కులు, ఆర్.మానస 421, హారిక 421మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వై.కె.ఎస్. డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, అనిల్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి,ఎం.సతీశ్‌కుమార్ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం ధాన్యం పోటెత్తింది. అలాగే మక్కల రాశులతో మార్కెట్ ప్రాంగణం కళకళలాడుతూ కనిపించింది. మార్కెట్ ఆవరణలోని కవర్ షెడ్డుతో పాటు ఇతర షెడ్లన్నీ ధాన్యం, మక్కలతో నిండిపోయాయి. స్థలం సరిపోకపోవడంతో రైతులు తాము తీసుకువచ్చిన ధాన్యం, మక్కలను వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలోని ఖాళీ ప్రదేశాల్లో రాశులుగా పోసుకున్నారు. వ్యాపారులు 2,877 బస్తాల (1,869 క్వింటాళ్లు) ధాన్యం కొనుగోలు చేశారు. అలాగే 3,668 బస్తాల (2,201 క్వింటాళ్లు) మక్కలను కొన్నారు. కాగా మార్కెట్ షెడ్లన్నీ నిండి ఉన్నాయని, బుధవారం ధాన్యం, పత్తి, మక్కలు, అపరాలను తీసుకురావద్దని, మిర్చి క్రయవిక్రయాలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయని ఏఎంసీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ తెలిపారు.



స్థలం సరిపోక ఖాళీ ప్రదేశంలో పోసిన ధాన్యం రాశులు

మిర్చి ధర తగ్గించారంటూ రైతుల ఆందోళన

- కేసముద్రం మార్కెట్‌లో ఘటన

కేసముద్రం: కొందరు వ్యాపారులు కుమ్మక్కై మిర్చి ధరను అమాంతం తగ్గించి, తమను మోసం చేస్తున్నారని రైతులు ఆగ్రహించిన సంఘటన కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో జరిగింది. మార్కెట్‌కు మంగళవారం సుమారు 700 మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. ఈ మేరకు వ్యాపారులు టెండర్లు వేయగా, పలువురు రైతులు తీసుకువచ్చిన మిర్చికి క్వింటాకు రూ.6 వేల వరకే ధర పడింది. దీంతో రైతులంతా ఆగ్రహానికి లోనై నిన్నటి వరకు మిర్చి క్వింటాకు గరిష్ఠ ధర రూ.12వేల వరకు ఉండగా, ఇప్పుడు సగానికి సగం ధరను ఎలా తగ్గిస్తారంటూ ఆందోళనకు దిగారు. ధరతోపాటు, తూకంలో మోసం చేస్తున్నారని, క్యాష్ కటింగ్ పేరుతో తమను దోచుకుంటున్నారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి తమ మిర్చికి టెండర్లు వేయాలంటూ వారు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సెకండ్ ఎస్సై కరుణాకర్ పోలీస్‌సిబ్బందితో మార్కెట్ యార్డుకు చేరుకుని, రైతులతో మాట్లాడారు. ధర పడని బస్తాలకు తిరిగి బుధవారం టెండర్లు వేయిస్తామని రైతులను శాంతింపజేశారు.



ఆందోళనకు దిగిన మిర్చి రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

తొర్రూరు: వడదెబ్బపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ రవి రాథోడ్ సూచించారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. రోజురోజుకూ ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనారోగ్యం బారిన పడితే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వైద్యాధికారులు, సిబ్బంది సైతం అప్రమత్తంగా ఉంటూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్స్ జ్వలిత, మీరాజ్, ప్రియాంక, నందన, సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్

ధాన్యం ఆరబోస్తూ రైతు మృతి

నెల్లికుదురు: ధాన్యం ఆరబోస్తూ ఓ రైతు కుప్పకూలిపోయి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని మధనతుర్తి గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బిర్రు వెంకన్న (52) తనకున్న వ్యవసాయ భూమిలో సాగు చేసిన వరి పంట కోత కోశాడు. పొలం వద్దనే ధాన్యాన్ని ఆరబెట్టాడు. కాగా, ధాన్యాన్ని నేర్పుతున్న క్రమంలో కుప్పకూలిపోయి మృతి చెందాడు. ఎండ తీవ్రతతో వడదెబ్బ తగిలి మృతి చెంది ఉంటాడని గ్రామస్తులు తెలిపారు.



వెంకన్న మృతదేహం

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు..

- ఒకరి దుర్మరణం
- ఉప్పల్‌లో ఘటన

కమలాపూర్: రాంగ్ రూట్లో వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ ద్విచక్రవాహనదారుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మంగళవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్‌లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కమలాపూర్ మండలం రాములపల్లి (కన్నూరు)కు చెందిన వంటకాల రాంరెడ్డి (52) ద్విచక్రవాహనంపై ఉప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి వస్తున్నాడు. బస్టాండ్ వద్ద యూటర్న్ తీసుకుని వెళ్తున్న క్రమంలో ఉప్పల్‌కు రాంగ్ రూట్లో వస్తున్న ఆర్టీసీ బస్సు.. ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంతో సహా రాంరెడ్డి బస్సు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న సీఐ హరికృష్ణ సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతుడి కుమారుడు ప్రణయ్ ఫిర్యాదు మేరకు రేగొండ మండలానికి చెందిన బస్సు డ్రైవర్ మంతెన శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ హరికృష్ణ తెలిపారు. కాగా, ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగిందని, ప్రమాదం జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ పరారైనట్లు స్థానికులు తెలిపారు.



రాంరెడ్డి (ఫైల్)